క్లుప్తంగా

నేడు ఇరిగేషన్ కార్యాలయం ప్రారంభం

మర్రిపాలెం(నాగాయలంక): మర్రిపాలెంలో నిర్మించిన జలవనరులశాఖ, డిస్ట్రిబ్యూటరీ కమిటీ, దివి సౌత్ సెక్షన్ కార్యాలయాల సముదాయ భవనాన్ని సోమవారం ఉదయం 9 గంటలకు అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభిస్తారని ఇరిగేషన్ ఏఈఈ పాన్నూరు రవితేజ ఆదివారం చెప్పారు. ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ నిధులు రూ.33లక్షలతో భవనాన్ని నిర్మించారు. మండలంలో నాలుగో విడత చేయూత కార్యక్రమంలో సోమవారం నాగాయలంకలో లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్నట్లు ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేమాలవారిపాలెంలోని నాగాయలంక మార్కెట్ యార్డులో ఉదయం 10గంటలకు జరుగుతుందని పేర్కొన్నారు.

సంగమేశ్వరంలో ముగిసిన శివరాత్రి ఉత్సవాలు



సంగమేశ్వరం(నాగాయలంక): మండలంలో సంగమేశ్వరం గ్రామంలోని శ్రీగంగాపార్వతీ సమేత సంగమేశ్వరస్వామి వార్షిక మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నాలుగురోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో శనివారం రాత్రి గ్రామపెద్దల నేతృత్వంలో అర్చకులు కొల్లిపర తిరుమల సాయి భార్గవ్, కొల్లిపర సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తెప్పించిన రుద్రాక్షలతో వైభవంగా అభిషేకం చేశారు. ఆదివారం తొలుత పార్వతీసమేత సంగమేశ్వరస్వామి సముద్ర విహార ఊరేగింపు, అనంతరం గ్రామంలో వసంతోత్సవం జరిగింది. ఉత్సవాల ముగింపులో భాగంగా పూర్ణాహుతి, ధ్వజఅవరోహణ, పవళింపుసేవ చేశారు.

110 మందికి కంటి వైద్య పరీక్షలు

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి(పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యాన ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం జరిగింది. తలశిల శ్రీరాములు, ఉప్పల వెంకయ్య, కనిగంటి వెంకయ్య కుటుంబీకుల ఆర్థిక సౌజన్యంతో స్థానిక మారుతీ విద్యానికేతన్ ప్రాంగణంలో శిబిరం నిర్వహించారు. దీనిలో 110 మందికి పరీక్షలు చేయగా 90మందికి ఐఓఎల్ ఆపరేషన్ (కంటి లోపల అద్దం అమరిక)లు అవసరమయ్యాయి. ఉచిత శస్త్ర చికిత్సలకు బస్సులో పెదకాకాని ఆస్పత్రికి పంపించినట్లు సంస్థ అధ్యక్షుడు రఘుశేఖర్ చెప్పారు. డాక్టర్ దివ్యభార్గవి, డాక్టర్ రుతుజ నేత్ర పరీక్షలు చేశారు. ఆసుపత్రి క్యాంప్ ఇన్‌చార్జి నాగబాబు, కనిగంటి వెంకటనారాయణ, మత్తి శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు అంబటి బ్రాహ్మణయ్య విగ్రహావిష్కరణ

కోడూరు: నియోజకవర్గంలోని ఉల్లిపాలెం–భవానీపురం వారధి వద్ద అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే, నాటి టీడీపీ నేత బ్రాహ్మణయ్యకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. 2019 ఎన్నికల సమయంలో అవనిగడ్డలో పర్యటించిన జగన్‌మోహన్ రెడ్డి కృష్ణానదిపై నిర్మించిన ఉల్లిపాలెం–భవానీపురం వారధికి అంబటి బ్రాహ్మణయ్య పేరు పెడతామని హామీ ఇచ్చారు. దీనిపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. ఆయన పేరును కాగితాలకే పరిమితం చేయకుండా తెలుగుతల్లి విగ్రహం, వారధి మధ్య బ్రాహ్మణయ్య విగ్రహం ఏర్పాటుచేశారు. సోమవారం ఆవిష్కరించనున్నారు.

నాగేశ్వరస్వామి వసంతోత్సవం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలోని శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ ఏసీ చక్రధరావు ఆధ్వర్యాన ఆదివారం ఉదయం 8 గంటలకు నిత్య బలిహరణ, 10 గంటలకు చూర్ణోత్సవం, అవబృథోత్సవం, త్రిశూల స్నానం, వసంతోత్సవం జరిగింది. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేదపండితులతో పూర్ణాహుతి జరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు రాజాధిరాజ వాహనంపై శ్రీ స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు నిత్య బలిహరణ, 9 గంటలకు గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం పారువేట, శమీవృక్ష పూజ వంటి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

కంప్యూటర్ శిక్షణ సర్టిఫికెట్లు అందజేత

అవనిగడ్డ: స్థానిక గాలిగోపురం సమీపంలో సైబర్‌జోన్ ఆధ్వర్యాన నిర్వహించిన ఉచిత కంప్యూటర్ శిక్షణ సర్టిఫికెట్లను జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ అందజేశారు. సైబర్‌జోన్ కంప్యూటర్స్, స్వామి వివేకానంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా, సైబర్‌జోన్ కంప్యూటర్ వ్యవస్థాపకుడు జెట్టిచలం ప్రసాద్, కంప్యూటర్ నిర్వాహకురాలు బీసాబత్తిన కృష్ణలీల తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చిన ఘనత వైఎస్సార్, జగన్‌దే

- ఎమ్మెల్యే పేర్ని నాని
- నాడు బందరులో వైఎస్సార్ హయాంలో ఓవర్‌హెడ్ ట్యాంకుల మంజూరు



శిలాఫలకాన్ని ఆవిష్కరించి ఓవర్‌హెడ్ ట్యాంకును ప్రారంభిస్తున్న బందరు ఎమ్మెల్యే పేర్ని నాని, చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ, కార్పొరేటర్ విజయగంగ తదితరులు

మచిలీపట్నంటౌన్: బందరు ప్రజల దాహార్తిని తీర్చిన ఘనత వైఎస్సార్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) చెప్పారు. నగరంలోని 25వ డివిజన్ ఓగీస్‌పేటలో రూ. 2.35 కోట్లతో నిర్మించిన 500 కిలోలీటర్ల వాటర్ ట్యాంక్, పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పేర్ని నాని, మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పేర్ని నాని మాట్లాడుతూ మచిలీపట్నం ప్రాంతానికి నాడు తన తండ్రి, మాజీ మంత్రి పేర్ని కృష్ణమూర్తి తరకటూరులో 200 ఎకరాల్లో చెరువు తవ్వించి సిమెంటు పైప్‌లైన్ల ద్వారా తాగునీరు అందించారన్నారు. అయినా ట్యాంకర్ల ద్వారానే నగరంలోని అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా జరిగేదని ప్రతి ఒక్కరూ బిందెలతో నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి, మరికొంతకాలం తాగునీరు, ఉప్పునీరు బోరింగ్‌లతో కొట్టుకునే పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఓవర్‌హెడ్ ట్యాంకులను మంజూరు చేసి నిర్మించడంతో ఆ సమస్య కొంతమేర తీరిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పూర్తిస్థాయిలో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చేయడంతో అన్ని అవసరాలకు తాగునీటినే వినియోగించే పరిస్థితికి వచ్చామన్నారు.

రూ.45 కోట్ల నిధుల మంజూరు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరో రూ. 45 కోట్లు మంజూరు చేశారని ఈ నిధులతో ఓవర్‌హెడ్ ట్యాంకులు, వీటికి అవసరమైన పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తే నగరంలో రోజూ నీటి సరఫరా చేసేందుకు వీలు కలుగుతుందన్నారు. రానున్న ఏడాదిన్నరలో ఈ పనులు పూర్తవుతాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మునుపెన్నడూ లేని విధంగా నగరంలో 20 వేల మందికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారన్నారు. ఈ డివిజన్ పరిధిలోని ఇద్దరు గతంలో మంత్రులుగా చేసినా ఇక్కడ అభివృద్ధి పట్టలేదని చెప్పారు. మట్టి రోడ్లుగా ఉన్న ఈ ప్రాంతాన్ని తాను అభివృద్ధి చేశానని, అధికారం ఉన్నా లేకున్నా ఈ ప్రాంతవాసులు తనను అక్కున చేర్చుకుని ప్రేమాభిమానాలు చూపుతున్నారన్నారు. ఈ ప్రాంతానికి చెందిన ఏఐటీయూసీ నాయకుడు కరపాటి సత్యనారాయణ మృతికి సమావేశంలో రెండు నిముషాలు మౌనం పాటించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా అధ్యక్షత వహించిన సమావేశంలో డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మాజీ డిప్యూటీ మేయర్ తంటిపూడి కవిత, 25వ డివిజన్ కార్పొరేటర్ కొలుసు విజయగంగ, ఆ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ కొలుసు హరిబాబు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యేశ్వరరావు, పలు డివిజన్ల కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

మంచి చేశారు.. మళ్లీ గెలిపిద్దాం

జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాము



జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, రాము తదితరులు

పెడన: పేదలకు మంచి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము అన్నారు. పెడన వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం వైఎస్సార్ చేయూత పంపిణీ కార్యక్రమంలో వీరు పాల్గొన్నారు. తొలుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సభలో హారిక మాట్లాడుతూ జగనన్న ఐదేళ్ల పాలనలో పేదలకు మంచి చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. గత ప్రభుత్వానికి, జగన్ ప్రభుత్వానికి తేడా గమనించి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలన్నారు. నియోజకవర్గంలో ఉప్పాల రాముకు కూడా అవకాశం ఇస్తే మంచి చేస్తారని, మీ సేవకుడిగా పని చేస్తారన్నారు. రాము మాట్లాడుతూ పేదలకు నేరుగా సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కృత్తివెన్ను మండలం రామాపురంతో పాటు మరో రెండు గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించామన్నారు. బంటుమిల్లి మల్లేశ్వరం వాటర్ స్కీంను బాగు చేయించి మరింత శుద్ధజలాన్ని అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. పెడన పురపాలక సంఘంలో కూడా రూ.30లక్షలతో మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. పెడన రూరల్‌లో కూడా పలు వాటర్ స్కీంలను అభివృద్ధి చేస్తానని, ఉప్పలకలువగుంట వాటర్ స్కీం, నందిగామ వాటర్ స్కీంలను కూడా అభివృద్ధి చేయిస్తున్నానని స్పష్టం చేశారు. పెడన పట్టణంలో 1,933 మందికి రూ.3.62 కోట్లు, రూరల్‌లో 2,166 మందికి రూ.4.06 కోట్లు చేయూత ద్వారా నిధులు వారి బ్యాంకు ఖాతాలకు జమవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ విజయవాడ రీజియన్ చైర్మన్ పిన్నింటి మహేష్, పెడన ఎంపీపీ రాజులపాటి వాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, పెడన ఏఎంసీ చైర్‌పర్సన్ గరికపాటి చారుమతి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భళ్ల జ్యోత్స్నరాణి, మాజీ ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బి.జ్యోతి, పట్టణ, మండల కన్వీనర్లు మల్లి, నాగబాబు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, అభిమానులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, ఆర్‌బీకే చైర్మన్లు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇంటి స్థల పట్టాలు



ఐదుగుళ్లపల్లిలో ఇళ్ల పట్టాలతో లబ్ధిదారులు

గూడూరు: నవరత్నాలు..పేదలకు ఇళ్లు పథకంలో భాగంగా గూడూరు మండలంలో నివేశన స్థలాలు పొందిన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. మండలంలో 1,084 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయి. వీరికి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసిన రెవెన్యూ అధికారులు రిజిస్టర్డ్ పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం గ్రామాల వారీగా సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్, ఆర్బీకే చైర్మన్ల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఇస్తున్న రిజిస్టర్డ్ ఇళ్ల పట్టాలు భవిష్యత్తులో క్రయ విక్రయాలు జరపడం, బ్యాంకుల్లో తనఖాలు పెట్టుకోవడానికి అవకాశం లభించడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డును.. ఓఎన్‌జీసీ పునర్నిర్మించాలి

–వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రజల నిరసన



వక్కపట్లవారిపాలెం–భావదేవరపల్లి రోడ్డు నుంచి ఓఎన్‌జీసీ సైట్‌లకు వెళ్లే వంతెనపై నిరసన

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): రోడ్డును ఓఎన్‌జీసీ పునర్నిర్మించాలని స్థానికులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు డిమాండ్ చేశాయి. నాగాయలంక సమీపంలోని వక్కపట్లవారిపాలెం వద్దనున్న ఓఎన్‌జీసీ చమురు, సహజ వాయువుల రిగ్గింగ్ సైట్ వద్ద.. వైఎస్సార్ సీపీ మండల నేతల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, పరిసర గ్రామాల ప్రజలతో కలసి ఆదివారం భావదేవరపల్లి – వక్కపట్లవారిపాలెం మెయిన్ రోడ్డు నుంచి ప్లాంట్‌లకు వెళ్లే వంతెనపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఓఎన్‌జీసీ ఆయిల్, గ్యాస్ ట్యాంకర్లు, ఇతర భారీ వాహనాలు నిత్యం తిరగడంతో వక్కపట్లవారిపాలెం– భావదేవరపల్లి ఇతర దిగువ తీర గ్రామాల ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైంది. సంబంధిత మెయిన్ రోడ్డు పునర్నిర్మాణ పనులను ఓఎన్‌జీసీ సంస్థ చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నేత, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి మాట్లాడుతూ అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ద్వారా గతేడాది రోడ్డు ధ్వంసంపై ప్రతిపాదనలు పంపినా సంస్థ ఉన్నతాధికారులు ఖాతరు చేయకపోవడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని చెప్పారు. సీఎస్‌ఆర్ కింద పరిసర గ్రామాల్లో ఓఎన్‌జీసీ సంస్థ అభివృద్ధి చేయకుండా సహాయ సహకారాలు అందించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఆందోళనను గమనించిన సంస్థ ప్రతినిధులు.. నిరసన తెలుపుతున్న వారి వద్దకు వచ్చి ఆదివారం కావడంతో సైట్ హెచ్.ఆర్ రాలేదని, విషయం ఉన్నతాధికారులుకు తెలియపర్చామని సర్ది చెప్పారు. సంబంధిత ఉన్నతాధికారులు సోమవారం అవనిగడ్డ ఎమ్మెల్యేను కలసి చర్చిస్తారని చెప్పడంతో ఆందోళన తాత్కాలికంగా విరమించారు. పాలెం సర్పంచ్ అంబటి శ్యామ్‌ప్రసాద్, వైస్ ఎంపీపీ పరిశె అమ్మన్న, నంగేగడ్డ సర్పంచ్ భర్త తోట కృష్ణ, బర్రంకుల పీఏసీఎస్ అధ్యక్షుడు తోట సాయిబాబు, డీసీ మాజీ చైర్మన్ బీసాబత్తుని ప్రసాద్, భోగాది మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు



ఇంటర్ ప్రవేశ పరీక్షను పరిశీలిస్తున్న రూతమ్మ

పెడన: మండలంలోని బల్లిపర్రులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఆదివారం ఐదో తరగతికి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని చీఫ్ సూపరింటెండెంట్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రూతమ్మ తెలిపారు. ఉదయం ఐదో తరగతి వారికి 119 మందికి 58 మంది హాజరయ్యారని, ఇంటర్ ప్రథమ సంవత్సరానికి మధ్యాహ్నం నుంచి నిర్వహించిన పరీక్షకు162 మందికి 156 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. పామర్రు గురుకుల పాఠశాల సోషల్ పీజీటీ పి.చంద్రపాల్ పర్యవేక్షకుడిగా వ్యవహరించారు.

చల్లపల్లి: స్థానిక నారాయణరావు నగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ గురుకుల కళాశాలలో ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ పీ.వేణు ప్రకాష్ రాణి పర్యవేక్షణలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు పరీక్షలు నిర్వహించారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు 193 మందికి 175 మంది హాజరయ్యారు.

ఇంటర్మీడియెట్ ప్రవేశ పరీక్షలకు 196 మందికి 183 మంది హాజరయ్యారు. డిప్యూటీ ఏఎంఓ మల్లేశ్వరరావు, అబ్జర్వర్ ఎం.శ్రీనివాసరావు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

నేటి నుంచి సంపటాలమ్మ ఆలయ వార్షికోత్సవం

చల్లపల్లి: గ్రామ దేవత శ్రీ సంపటాలమ్మ తల్లి ఆలయ 25వ వార్షిక మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అమ్మవారికి అభిషేకం, సామూహిక కుంకుమ పూజ, 12న కుంకుమ పూజ, 13న కుంకుమార్చన, అభిషేకాలు, అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

నేడు జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, రాము పర్యటన

బంటుమిల్లి: ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఉప్పాల రాము సోమవారం మండలంలో విస్తృతంగా పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని మండల పార్టీ అధ్యక్షుడు సుజ్ఞానం మహేష్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, నేతలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

పింఛనర్ల ఔదార్యం

మచిలీపట్నంటౌన్: నగరంలోని 38వ డివిజన్‌లో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సామాజిక పింఛన్ లబ్ధిదారు బూరగడ్డ హైమావతి కుటుంబాన్ని తోటి పింఛనర్లు ఆర్థికంగా ఆదుకున్నారు. ఆ డివిజన్‌లోని పింఛన్‌దారులు అందరూ తలో రూ. 100 సేకరించి వచ్చిన రూ. 20 వేలను హైమావతి కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ శ్రీకాకోళపు నరసింహ గుప్తా, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు వేముల కృష్ణ అందజేశారు. వారికి హైమావతి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



హైమావతి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న దృశ్యం

23న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీస్

మచిలీపట్నంటౌన్: ఫాల్గుణ పౌర్ణమికి భక్తుల సౌకర్యార్థం అరుణాచల గిరి ప్రదక్షిణకు మచిలీపట్నం నుంచి అరుణాచలానికి ఈ నెల 23వ తేదీన ప్రత్యేక బస్సు సర్వీస్‌ను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ టి.పెద్దిరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టికెట్ ధర రూ. 3 వేలుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆ రోజు సాయంత్రం 5గంటలకు మచిలీపట్నం నుంచి ఈ సర్వీస్ బయలుదేరి రేపల్లె మీదుగా శ్రీకాళహస్తి, కాణిపాకం, అర్ధవీడు, సిరిపురం మీదుగా అరుణాచలానికి 24వ తేదీ చేరుతుందని తెలిపారు. ఆ రోజు దైవదర్శనం, అరుణాచల గిరి ప్రదక్షిణ చేసుకున్న అనంతరం కంచి, విష్ణుకంచి, కామాక్షి దేవాలయం, తిరుత్తణి ప్రాంతాలను దర్శించుకుంటారని పేర్కొన్నారు. 26వ తేదీన ఈ సర్వీస్ మచిలీపట్నం చేరుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 8247529433 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాలు



గూడూరు: మండలంలోని పోలవరంలో గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలి సర్వస్వం కోల్పోయిన అమృత అంజలి కుటుంబానికి లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం పోలవరంలో జరిగిన కార్యక్రమంలో దుస్తువులు, వంట సామగ్రి, నిత్యవసరాలు, రూ.2వేల నగదును లంకిశెట్టి బాలాజీ అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది జొన్నల వెంకట నాగరాజు, మాదిరెడ్డి బాబా, స్థానికులు పెంద్ర సిద్ధయ్య, అమృత శ్యామ్, పెంద్ర వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

బంటుమిల్లి: కొత్తూరు–సాతులూరు పంచాయతీ శివారు బంగళా గ్రామాల మధ్య లింకు రోడ్డుకు ఆదివారం గ్రాన్యులార్ సబ్‌బేస్ మెటీరియల్(జీఎస్బీ) రహదారి నిర్మాణం పనులకు సర్పంచ్ బండారు చంద్రశేఖర్ శంకుస్థాపన చేశారు. జెడ్పీ గ్రాంటు సుమారు రూ. 9 లక్షలు, మండల పరిషత్ గ్రాంటు రూ. 10 లక్షలు, పంచాయతీ నుంచి 15వ ఆర్థిక సంఘ నిధుల నుంచి రూ. 3 లక్షలు మొత్తం రూ. 22 లక్షలతో కంచడం పంచాయతీ శివారు కొత్తూరు మంచినీళ్ల బావి నుంచి సాతులూరు పంచాయతీ శివారు బంగళా గ్రామం వరకు జీఎస్బీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ పనుల్లో భాగంగా జంగిల్ క్లియరెన్స్ చేసి కచ్చా రోడ్డును సిద్ధం చేశారు. ఈ రోడ్డు నిర్మాణంతో కంచడం, బర్రిపాడు, సాతులూరు పంచాయతీ పరిధిలోని రైతులకు తమ పంటలు ఇబ్బంది లేకుండా ఇళ్లకు చేర్చుకోవడానికి రోడ్డు సౌకర్యం ఏర్పడుతుందని సర్పంచ్ చంద్రశేఖర్ తెలిపారు. బంటుమిల్లికి దగ్గర దారి ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు.

పులిగడ్డ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు



పులిగడ్డ చెక్‌పోస్టు వద్ద డీఎస్పీమురళీధర్

అవనిగడ్డ: పులిగడ్డ అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద డీఎస్పీ మురళీధర్ ఆదివారం పలు వాహనాలను తనిఖీలు చేశారు. చెక్‌పోస్టును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆయన తెలిపారు. డబ్బు, మద్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చేయూత చెక్కు పంపిణీ

కోడూరు: వైఎస్సార్ చేయూత చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణంలో మధ్యాహ్నం 2గంటలకు మహిళలకు చేయూత చెక్కును ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అందిస్తారని పేర్కొన్నారు.

వైభవంగా పరమేశ్వరుని రథోత్సవం



కృత్తివెన్నులో స్వామివార్ల రథోత్సవం

కృత్తివెన్ను: వేలాది మంది భక్తుల జయ జయ ధ్వానాల నడుమ శ్రీదుర్గాపార్వతీ సమేత నాగేశ్వర స్వామి శ్రీరమా సహిత వీరవెంకట సత్యనారాయణ స్వామి వార్ల రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు ఉత్సవమూర్తులను రథంపై ఊరేగించారు. కృత్తివెన్ను మండలంలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి రథంపై అరటిపండ్లు వేసి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, దేవస్థానం చైర్మన్ పట్టపు నాగేశ్వరరావు పాల్గొనగా సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్‌ఐ నాగరాజులు పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆనందోత్సాహాలు



సిద్ధం సభ విజయవంతం కావడంపై కేకులు కట్ చేసి మిఠాయిలు తినిపించుకుంటున్న నేతలు

గూడూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం అద్దంకిలో నిర్వహించిన సిద్ధం సభ సక్సెస్ కావడంతో గూడూరులో వైఎస్సార్ సీపీ శ్రేణులు కేకు కట్ చేసి సందడి చేశారు. ఆ పార్టీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము ఆధ్వర్యాన గూడూరు సెంటరులో ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి సిద్ధం సభ ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు పర్ణం పెదబాబు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, ఆర్బీకే చైర్మన్ ఫైజుల్ రహ్మాన్, పార్టీ నాయకులు గొరిపర్తి రవికుమార్, అట్లూరి వెంకటేశ్వరరావు, జక్కా రాజేష్, లింగం విజయ్, కంచర్లపల్లి నాగేంద్రం, మాగంటి నాగరాజు, శివాజీ, నాగూర్ తదితరులు నృత్యాలు చేస్తూ పార్టీ శ్రేణులను ఉత్సాహ పరిచారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు తరలివచ్చి సిద్ధం సభను వీక్షించారు.

సావిత్రీబాయి జీవితం మహిళలకు ఆదర్శం



నాగాయలంకలో సావిత్రీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పించిన బీసీ నేతలు

నాగాయలంక: దేశంలో మొట్టమొదటి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే వర్ధంతిని ఆదివారం నాగాయలంక బోసుబొమ్మ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఏపీ సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ అసమానతలు, అంటరానితనం నిర్మూలన, మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాడిన సావిత్రీబాయి పూలే జీవితం నేటి మహిళలకు ఆదర్శప్రాయమన్నారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పిరాటి శ్రీనివాసరావు, ఉప్పల మురళి, బీసీ నాయకులు ఎస్.వెంకటేశ్వరమ్మ, కర్రి కృష్ణమూర్తి, నాగిడి పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్‌హుడ్ ఆధ్వర్యంలో చలివేంద్రాల ఏర్పాటు



అవనిగడ్డ: అవనిగడ్డ చైల్డ్‌హుడ్ గ్రూపు స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రెండుచోట్ల చలివేంద్రాలను ప్రారంభించారు. పులిగడ్డ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం డీఎస్పీ మురళీధర్ ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. అవనిగడ్డలో సంస్థ కార్యాలయసెదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ గంగాధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయకుమార్, సేవాసంస్థ అధ్యక్షుడు మత్తి శ్రీనివాసరావు, సెక్రటరీ దివి లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం పనుల పరిశీలన

మచిలీపట్నంటౌన్: నగరంలోని జిల్లా కోర్టు సెంటరు సమీపంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఆదివారం పరిశీలించారు. దాదాపు రూ. 2.50 కోట్లతో ఇక్కడ ఇండోర్ స్టేడియంల నిర్మాణ పనులు చేపట్టారు. ఆయన తుదిదశ పనులను పరిశీలించి సూచనలు చేశారు. పేర్ని కిట్టు వెంట నేతలు గాజుల భగవాన్, ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

